ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 31.0
కనిష్ఠం 22.0

ANDHRAJYOTHY

సూర్యాపేట

5

ఆదివారం 10 నవంబరు 2024





యాదగిరీశుడికి
శాస్త్రోక్తంగా
నిత్య పూజలు

- తులసీ దళాలతో అర్చన
- సత్యదేవుడి వ్రతాల్లో పాల్గొన్న 820 జంటలు

6

ఇన్‌సైడ్



రామన్నపేట సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

6

వచ్చేనెల 9లోగా
రుణమాఫీ పూర్తి చేస్తాం

- రామన్నపేటలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు కృషి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రాథమిక సహకార సంఘం నూతన భవనం ప్రారంభం



నల్లగొండ జిల్లా కేంద్రం ఎంజీయూలో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

ఎంజీయూ విద్యార్థులు
ఆవిష్కర్తలుగా ఎదగాలి

- యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఎంజీయూలో పలు నిర్మాణాలకు శంకుస్థాపన

6



గుట్టలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

కేసీఆర్ ఆనవాళ్లు
తుడిచే దమ్ము ఎవ్వరికీ లేదు

- రాష్ట్ర బడ్జెట్‌లో ఆలయానికి నయా పైసా కేటాయించలేదు
- యాదాద్రిగా పేరు మార్చినట్టు ఏ జీవోలో లేదు
- కేవలం చిన్న జీయర్ సూచనమేరకే ఆ పేరు మనుగడలో
- సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో గుట్టకు ప్రయోజనంలేదు
- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

6

స్వర్ణతాపడం చకచకా



యాదాద్రి ఆలయ విమాన గోపురానికి స్వర్ణతాపడం నమూనా

- ఈ నెల 15నుంచి ప్రారంభం కానున్న పనులు
- పనులపై సీఎం ఆరా
- తాపడం అనంతరం మహాకుంభాభిషేకం
- పెండింగ్ పనులపై ప్రభుత్వం దృష్టి

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి స్వర్ణతాపడం పనులు చకచకా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి గుట్ట ఆలయాన్ని దర్శించుకొని స్వర్ణతాపడం పనులపై ఆరా తీశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి తాపడం రేకులను అమర్చే పనులు ప్రారంభంకానున్నాయి. ఈ పనులు పూర్తి అనంతరం మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. అదేవిధంగా పెండింగ్ పనులపై కూడా ప్రభుత్వం దృష్టిసారించింది.

\- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

గుట్టలో స్వామివారివారి ప్రధానాలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉంది. స్వామివారి ఆలయానికి స్వర్ణతాపడం పనులు వెంటనే చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకన్నారు. శుక్రవారం గుట్టకు వచ్చిన సీఎం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డితో కలిసి ఆలయ పనులపై సమీక్ష కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ ఉన్నతాధికారులు శైలజారామయ్యర్, హనుమంత్ కే.జెండగే, ఆలయ ఈవో భాస్కర్‌రావు తదితరులు విమానగోపురం స్వర్ణతాపడం పనుల పురోగతిని సీఎంకు వివరించారు. దేశంలోనే మొట్టమొదటి ఎత్తయిన స్వర్ణగోపురం రికార్డు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికే దక్కుతుంది. విమాన గోపురానికి బంగారం తాపడం అమర్చే పనులు ఈ నెల 15నుంచి ప్రారంభమై, ఫిబ్రవరి 20లోగా పూర్తి చేసేలా నిర్ణయం తీసుకున్నారు. తాపడం పనులు ప్రభుత్వం తమిళనాడు రాష్ట్రానికి చెందిన మెసర్స్ స్మార్ట్ క్రియేషన్స్‌కు అప్పగించింది. ఇప్పటికే రాగి రేకులపై బంగారం తాపడం పనులు కొంత మేర పూర్తయ్యాయి. మొత్తం 10వేల చదరపు అడుగుల బంగారం తాపడం చేపట్టాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1,600చదరపు అడుగుల మేర పూర్తయింది. చదరపు అడుగుకు రూ.3,900 చొప్పున ప్రభుత్వం సదరు సంస్థకు చెల్లించనుంది. మొత్తంగా అందుకు రూ.3.90కోట్లు ఖర్చు కానుంది. స్వామివారి ప్రధానాలయం విమాన గోపురం 10,500ఎస్‌ఎఫ్‌టీల మేరకు ఉంది. 60కిలోల బంగారంతో తాపడం పూర్తికానుందని ప్రాథమిక అంచనా. ప్రస్తుతం ఆలయ అధికారుల వద్ద బంగారం తాపడం కోసం భక్తులు సమర్పించిన చందాలు రూ.20.50కోట్ల మేరకు ఉన్నాయి. భక్తులు స్వామివారికి మొక్కుల రూపంలో సమర్పించిన బంగారు సుమారు 12కిలోల వరకు ఉంది. భక్తులు విరాళంగా ఇచ్చిన బంగారం 10.500కిలోల వరకు ఉంది. అదేవిధంగా స్వామివారికి భక్తులు సమర్పించిన వెండి 2,300కిలోల వరకు ఉంది. బంగారంతో పాటు ప్రస్తుతం ఆలయ బ్యాంకు ఖాతాలో ఉన్న విరాళాలు నిధులతో 60కిలలో వరకు బంగారం సమకూరే అవకాశం ఉంది. బంగారు తాపడం పనుల కోసం భక్తులు, దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. 2025 మార్చిలో నిర్వహించే బ్రహ్మోత్సవాల వరకు

- మిగతా 7వ పేజీలో...



స్వామివారి విమానగోపురం బంగారం తాపడం రేకులను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (ఫైల్)

సర్వేను దేశమంతా గమనిస్తోంది



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

సూర్యాపేటఅర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేను యావత్ దేశం అంతా గమనిస్తుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేపై సీఎస్ శాంతి కుమారితో కలిసి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌తో ఆయన మాట్లాడారు. ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని, వాటిని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా ఎన్యూమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వేపై ప్రజలతో మమేకమైతే సందేహాలు ఏమిటో తెలుస్తాయని, తక్షణమే నివృత్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా ఎన్యూమరేటర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సర్వేలో భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ద్వారా ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, వారి ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. కలెక్టర్ తేజ్ ఎసనందలాల్ పవార్ మాట్లాడుతూ సర్వే సమాచారం గ్రామస్థాయిలోని చిట్టచివరి వరకూ చేరే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేకు సహకరించాలి

ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. జిల్లాకేంద్రంలోని 39వ వార్డులో కుటుంబసర్వేను తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌నాయక్, గోపారపు రాజు, బెల్లంకొండ రామ్మూర్తి సిబ్బంది పాల్గొన్నారు.



6

సాగర్‌కు స్వదేశీ దర్శన్
సొబగులు

- రూ.100 కోట్ల కేటాయించాలని కేంద్రానికి డీపీఆర్
- నిధులతో స్టార్ హోటల్స్, వాటర్ గేమ్స్ ఏర్పాటు
- సీ ప్లేన్స్‌పై ఆశలు

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

- జిల్లాలో వారం రోజుల్లో సర్వే పూర్తిచేస్తాం
- కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్



హుజూర్‌నగర్‌లో కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్‌నందాలాల్ పవార్

హుజూర్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సర్వేకు జిల్లా ప్రజలందరు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్‌పవార్ కోరారు. శనివారం పట్టణంలోని 26వ వార్డులో గెల్లా కొండల్‌రావు, ఉదయలక్ష్మి నివాసంలో కలెక్టర్ కుటుంబ సమగ్ర సర్వే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3.55లక్షలకు పైగా ఇళ్లకు సమగ్ర సర్వేకు సంబంధించి స్టిక్కరింగ్ పూర్తి చేశామన్నారు. శనివారం నుంచి వారంరోజుల్లో సర్వే వివరాలు పూర్తి చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,500 బ్లాక్‌లకు సంబంధించి 2,600 మంది సూపర్‌వైజర్లు అందుబాటులో ఉంటారని చెప్పారు. అవసరమైన చోట ఎన్యూమరేటర్లను అధికంగా అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, రాజశేఖర్‌గౌడ్, విజయ్, రంగారావు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి

పోలింగ్ కేంద్రాల వద్ద అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. శనివారం పట్టణంలో ని వీవీఎం పాఠశాలలో బీఎల్‌వోలతో మాట్లాడారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద కొత్త ఓటర్లు ఫామ్-6, ఫామ్-7పూర్తిచేసి బీఎల్‌వోలకు అందించాలన్నారు. కొత్తఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలన్నా రు. పట్టణంలోని అనేకచోట్ల ఓటర్ల నమోదు ప్రక్రి య కోసం బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రం వద్ద ఉం టారని తెలిపారు. అధికారులు సమయపాలన పా టించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

చిలుకూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ సూచించారు. మండలకేంద్రంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. చిలుకూరు జడ్పీహెచ్ఎస్‌లో నూతన ఓటర్ల నమోదుకోసం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో సూర్యనారాయణ, ఎంపీడీవో గిరిబాబు, ఎంపీవో జగదీష్, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్‌వో అశోక్, ఆర్‌ఐ సీతయ్య, పంచాయతీ కార్యదర్శి షరీఫుద్దీన్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో న్యాయవాదుల పాత్ర కీలకం

జిల్లా లీగల్‌సెల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి శ్రీవాణి



సమావేశంలో మాట్లాడుతున్న లీగల్‌సెల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి పి.శ్రీవాణి

సూర్యాపేటటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో న్యాయవాదుల పాత్ర కీలకమని జిల్లా లీగల్‌సెల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన చట్టాలపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టాలపై న్యాయవాదులకు పూర్తి అవగాహన ఉన్నప్పుడే కేసుకు సత్వర పరిష్కారం లభించి, కక్షిదారులకు సరైన న్యాయం చేకూరుతుందన్నారు. కేసులు స్వీకరించడమే కాకుండా ఆ కేసును ఎలా పరిష్కరించాలో తెలిసినప్పుడే కక్షిదారులకు న్యాయం లభిస్తుందన్నారు.

మహిళా న్యాయవాదులు అవగాహన సదస్సుకు రావడం అభినందనీయమన్నారు. ఐఎల్ జాతీయ జనరల్ సెక్రెటరీ బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో 1947కు పూర్వం, ఆతర్వాత తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటంలో న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో న్యాయవాది కేవీ రామలింగారెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ దుస్సా జనార్ధన్, కేవీఎల్, విద్యాసాగర్‌రెడ్డి, నూకల సుదర్శన్‌రెడ్డి, గుడుపూడి వెంకటేశ్వర్‌రావు, రవిందర్, శ్రీనివాస్, సత్యనారాయణ, మురళీ, రాజారాం పాల్గొన్నారు.

పేటకు భారీగా ధాన్యం రాక

వ్యవసాయ మార్కెట్‌కు 40,072 బస్తాల ధాన్యం

భానుపురి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం భారీగా వస్తోందని సూర్యాపేట మార్కెట్ కార్యదర్శి సంతోష్‌కుమార్ తెలిపారు. శనివారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు 40,072 బస్తాల ధాన్యం వచ్చిందన్నారు. జైశ్రీరాం రకం ధాన్యం 26,850 బస్తాలు రాగా, హెచ్‌ఎంటీ రకం ధాన్యం 7,121 బస్తాలు, ఐఆర్ 64 రకం ధాన్యం 3,501 బస్తాలు వచ్చింది. బీపీటీ రకం ధాన్యం 2,380 బస్తాలు, జైశ్రీరాం పాతవి 147 బస్తాలు, బీపీటీ పాతవి 47 బస్తాలు వచ్చాయన్నారు. 569 మంది రైతులు మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చారని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామన్నారు. సాధారణ రేటు కంటే ఎక్కువగానే మార్కెట్‌లో ధరలు వస్తున్నాయన్నారు.

ప్రజా సమస్యలకు ఎర్రజెండానే పరిష్కారం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి




మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

గరిడేపల్లి, నవంబరు 9: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా పోరాటాలే మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని తాళ్లమల్కాపురంలో జరిగిన సీపీఎం మండల 8వ మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ఎర్రజెండా పోరాటాలే సమస్యలకు పరిష్కార మార్గాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక కూడా తన విధానాలను మార్చుకోవడంలేదని, కులం పేరుతో, మతం పేరుతో ప్రజల ఐక్యతకు భంగం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు పారెపల్లి శేఖర్‌రావు, మండల కార్యదర్శి షేక్ యాకుబ్, నాగారపు పాండు, షేక్ బ్రహ్మం, వెంకటరెడ్డి, అనంతు ప్రకాష్, సైదులు, హుస్సేన్, రామ స్వామి, సైదయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌కు స్వదేశీ దర్శన్ సొబగులు

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను పర్యాటకంగా మరింతగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అతిపెద్ద రాతికట్టడమైన సాగర్ ప్రాజెక్ట్‌తో పాటు విశాలమైన డ్రోమ్ కలిగిన బుద్ధవనంతో ప్రపంచ వ్యాప్తంగా నాగార్జునసాగర్ గుర్తింపు పొందింది. అయితే ఇక్కడికి విచ్చేస్తున్న దేశ, విదేశాల పర్యాటకుల కోసం మరిన్ని ఏర్పాట్లు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం స్వదేశీ దర్శన్ ప్రాజెక్ట్ 2.0లో రూ.100 కోట్లు కేటాయించాలని కేంద్రానికి (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)డీపీఆర్‌ను సమర్పించింది. కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)



- సాగర్‌కు పర్యాటక శోభకు ప్రయత్నాలు
- రూ.100 కోట్లు కేటాయించాలని కేంద్రానికి డీపీఆర్
- నిధులతో స్టార్ హోటల్స్, వాటర్‌గేమ్స్ ఏర్పాటు

నాగార్జునసాగర్ ప్రాజెక్టును ఆనుకుని 274ఎకరాల్లో ఉన్న బుద్ధవనంలో రూ.25 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో డిజిటల్ మ్యూజియం ఏర్పాటుకు అనుమతులు లభించాయి. బుద్ధుడి జీవితం అర్థమయ్యేలా 2,500 బొమ్మల రూపంలో మ్యూజియాన్ని ఏర్పాటుచేయనున్నారు. ఇందుకోసం మహాస్థూపం ముందుభాగం స్థలాన్ని కేటాయించారు. అంతే కాకుండా బుద్ధవనంలో బౌద్ధ విశ్వవిద్యాలయం, గ్రంథాలయం ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

చాకలిగట్టుపై ప్రకృతి పర్యాటకం టూరిజం అభివృద్ధి

సాగర్ జలాశయం మధ్యలో 407 ఎకరాల్లో ఉన్న అటవీ శాఖ జింకల పెంపక కేంద్రం చాకలిగట్టును ప్రకృతి పర్యాటకం అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. గట్టుకు బుద్ధవనం వెనక వైపు నుంచి ప్రత్యేక లాంచీలను నడపాలని,అలాగే గట్టుపై పర్యాటకులు రాత్రి బసకు కాటేజీలు నిర్మించడానికి రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు మూడు సార్లు స్థలపరిశీలన చేశారు. ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో చాకలి గట్టును అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

వైజాక్ కాలనీలో కాటేజీల నిర్మాణం

సాగర్ రిజర్వాయర్ వెనక భాగంలో ఉన్న వైజాగ్‌కాలనీకి ఇటీవల పర్యాటకుల రాక పెరిగింది. నిత్యం సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి పర్యాటకులు వస్తున్నారు. అయితే ఇక్కడ కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో పర్యాటకుల కోసం ప్రత్యేకంగా కాటేజీలు నిర్మించడంతో పాటు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా లాంచీలు నడపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది.

బుద్ధవనం అభివృద్ధికి కృషి

సాగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు బుద్ధవనంలో స్టార్ హోటళ్లు, బౌద్ధ విశ్వవిద్యాలయం, సాగర్ జలాశయంలో వాటర్ గేమ్స్, పర్యాటకుల కోసం లాంచీలు, చాకలిగట్టు అభివృద్ధికి స్వదేశీ దర్శన్2.0లో రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని కేంద్రానికి డీపీఆర్‌లు పంపాం. కేంద్రం అందుకు సుముఖంగా ఉంది. త్వరలో బుద్ధవనంలో అభివృద్ధి పనులను మొదలుపెడతాం.

పటేల్ రమేష్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ, చైర్మన్

పర్యాటకులకు సౌకర్యాల లేమి

సాగర్‌కు ఏడాది మొత్తంలో పర్యాటకుల సందడి ఉంటుంది. బుద్ధుడి ఆనవాళ్లు కలిగిన ప్రాంతం కావడంతో బౌద్ధమతస్థులు ఎక్కువగా సందర్శిస్తుంటారు. ఇక్కడ ఉన్న అతిపెద్ద బౌద్ధవనంతో పాటు లాంచీలో వెళ్లి నందికొండలోని మ్యూజియాన్ని సందర్శిస్తుంటారు. ముఖ్యంగా డిసెంబరుతో పాటు వేసవిలో భూటాన్, నేపాల్, చైనా, టిబెట్‌తో పాటు ప్రపంచ దేశాలకు సంబంధించి బుద్ధిస్టులు, పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. వారంతా ఎటువంటి ఆధునిక సౌకర్యాలతో కూడిన హోటళ్లు లేక పర్యటన అనంతరం వెనుదిరిగి వెళ్తున్నారు. ఏడాదిలో సుమారు 5వేల వరకు విదేశీ పర్యాటకులు వస్తున్నా వారికి సౌకర్యాలు లేక ఇక్కడ బస చేయలేకపోతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0లో భాగంగా స్టార్ హోటళ్లు, కృష్ణా జలాశయంలో వాటర్ గేమ్స్, బౌద్ధ విశ్వవిద్యాలయం, చాకలిగట్టును ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని భావిస్తోంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖత చూపినట్లు పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తెలిపారు. కాగా ఇప్పటికే బుద్ధవనంలో డిజిటల్ మ్యూజియం ఏర్పాటు కోసం కేంద్రం రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఇదిలా ఉండగా సాగర్‌లో పర్యాటక అభివృద్ధి ఏర్పాట్లపై కొద్దిరోజుల కిందట రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు సాగర్ బుద్ధవనాన్ని శ్రీరామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు కమలేష్ డీ పటేల్(దాదాజీ)తో కలిసి సందర్శించారు. బుద్ధవనంలో వ్యూపాయింట్ వద్ద, ధ్యాన కేంద్రం వద్ద, కృష్ణ నది ఒడ్డున స్థల పరిశీలన చేశారు.

సీ ప్లేన్స్‌పై ఆశలు

నాగార్జునసాగర్ నుంచి సీ ప్లేన్స్(నీటి విమాన సర్వీసులు)పై ఆశలు చిగురిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నుంచి శ్రీశైలం జలాశయానికి డిసెంబరు 9వ తేదీన ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే ప్రతిపాదనల్లో ఉన్న సాగర్ సీ ప్లేన్స్ ఏర్పాటు విషయం కూడా ముందుకు సాగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

'సాధారణ పౌరుడిని ఎగరనివ్వండి' అనే నినాదంతో ఉడాన్(ఉస్ దేశ్‌కా హమ్ నాగరిక్) పేరుతో కేంద్ర ప్రభుత్వం పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకంలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నీటివిమాన సర్వీసులు అందుబాటులోకి తీసుకురావడానికి 2017లోనే ఆమోదం తెలిపింది. సాగర్ కేంద్రంగా సీ ప్లేన్స్ సర్వీసులను నడపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఏరో డ్రోమ్ ఏర్పాటుకు రూ.20 కోట్లు

నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం, విజయవాడ, విశాఖపట్నం, హుస్సేన్‌సాగర్ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ నీటి విమానాలు నడపాలని కేంద్రం సర్వే నిర్వహించింది. సాగర్‌లో విమానాలు ఎక్కడ దిగాలి అనే అంశంపై, అలాగే ఎక్కడికి నీటి విమానాలు నడపాలి అనే విషయంపై అధ్యయనం చేసింది. కెప్టెన్ ఇల్షాద్ అహ్మద్ నేతృత్వంలోని బృందం నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి పంపింది. అందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్యన 9, 12, 20సీట్ల సామర్థ్యంతో విమానాలు నడపవచ్చునని పేర్కొంది. శ్రీశైలం, విజయవాడ, విశాఖపట్నం, ప్రాంతాలకు సీ ప్లేన్స్ నడిపేలా ప్రణాళికలు రూపొందించింది. మొదటగా సాగర్ నుంచి శ్రీశైలం, విజయవాడలకు సేవలు అందుబాటులోకి తేవాలని, తర్వాత విశాఖపట్నం వరకు విస్తరించాలని పేర్కొంది. అయితే సాగర్ రిజర్వాయర్‌లో వాటర్ ఏరోడ్రోమ్(సాధారణ వాడుకలో రన్‌వే) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం మొదటి విడతగా కేంద్రం రూ.20కోట్లు విడుదల చేసింది.

ఏపీలో డిసెంబరు 9న మొదలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ దుర్గా ఘాట్ ఏరోడ్రోమ్ నుంచి శ్రీశైలం ప్రాజెక్ట్ వద్ద ఉన్న ఘాట్ వరకు డిసెంబరు 9వ తేదిన సీప్లేన్ నడపనున్నట్లు కేంద్ర విమానయాన సహాయ మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. రెండు ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ సీ ప్లేన్స్‌ను నడపనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని సాగర్ జలాశయం నుంచి నీటి విమానాలకు కూడా అంకురార్పణ జరుగవచ్చని భావిస్తున్నారు. సాగర్ నుంచి సీ ప్లేన్స్ నడిపితే పర్యాటకులు మరింత పెరగడంతో పాటు వారికి సమయం కూడా కలిసి వచ్చే అవకాశం ఉంటుంది.



కేసీఆర్ ఆనవాళ్లు తుడిచే దమ్ము ఎవరికీ లేదు

డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయాన్ని రూ.1200 కోట్లతో తీర్చిదిద్దిన కేసీఆర్ ఆనవాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి ముత్తాత కూడా తుడిచిపెట్టలేరని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి గుట్ట ఆలయ అభివృద్ధి కోసం పైసా ప్రకటించకుండా పర్యటన చేసినా ఉపయోగం లేదని విమర్శించారు. కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికే 95శాతం పూర్తయ్యాయని, కేవలం 5శాతం నిధులు కేటాయిస్తే పనులన్నీ పూర్తయ్యేవన్నారు. ఇప్పటివరకు రెండుసార్లు రాష్ట్ర బడ్జెట్‌లో ఆలయ అభివృద్ధికోసం నయాపైసా కేటాయించలేదని కేవలం పులిహోర, దద్దోజనం తినివెళ్లారని ఎద్దేవా చేశారు. ఇది ఎప్పుడైనా కాంగ్రెస్ పాలకులకు ఆనవాయితీగా వస్తున్న ఆచారమన్నారు. కేసీఆర్ దేవాలయ పరిశీలించడానికి వచ్చినప్పుడల్లా కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించి ఆలయాన్ని ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చేలా ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. కొన్ని వందల ఏళ్ల వరకు ఆయన చరిత్ర నిలిచి ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి యాదాద్రి జిల్లాపై ఎందుకంత వివక్ష, కక్షసాధింపు అని అన్నారు. కొత్త ప్రాజెక్టులు, నిర్మాణాలపై శ్రద్ధలేదని, ఆయన రాక్షసపాలకు స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. గంధమల్ల ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తే ప్రజలు సంతోషపడేవారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ కార్యదర్శి పాపట్ల నరహరి, అంకం నర్సింహ, నాయకులు ముక్కెర్ల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ బాబ, కొన్యాల నర్సింహారెడ్డి, దావూద్, గుండ్లపల్లి వెంకటేష్‌గౌడ్, సీస శేఖర్, వీరేషం, సీస నర్సింహ, గడ్డం చంద్రంగౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డివి చిల్లర మాటలు

నల్లగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని, భాష, ఆయనతీరు, వ్యవహారశైలి మార్చుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మండిపడ్డారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం పదవిలో ఉన్నానన్న సోయి లేకుండా తెలంగాణ సాధించి, అభివృద్ధి చేసిన కేసీఆర్‌పై అనుచితవ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 11 మాసాల్లో రేవంత్‌రెడ్డి ఏంచేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళన పాదయాత్ర పేరిట కనీసం కిలోమీటరు కూడా నడవలేదని ఎద్దేవా చేశారు. కేవలం కేసీఆర్‌ను తిట్టడం కోసమే జిల్లాలో మూడు వేల మంది పోలీసులను పెట్టుకొని బందోబస్తుతో వచ్చాడన్నారు. సభకు కూడా రెండు, మూడు వేలకు మించి ప్రజలకు రాలేదన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలను, నాయకులను ఎందుకు అరెస్టు చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బుల్డోజర్లతో తొక్కిస్తామంటూ ఇష్టానుసారంగా మాట్లాడితే సమాజం ఊరుకోదని హెచ్చరించారు. లక్షా 50 వేల కోట్లతో చేపట్టే మూసీ ప్రక్షాళనలో కమీషన్ల కోసం కక్కుర్తి పడుతూ మంత్రులు సీఎంకు భజన చేస్తున్నారని ఆరపించారు. జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ చేసిన రేవంత్‌రెడ్డి కేవలం దోచుకోవడం కోసమే ఈ కార్యక్రమాలు చేస్తున్నాడన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరిట కొన్ని భవనాలను కూల్చి వేసి భయభ్రాంతులకు గురిచేయడం అక్రమాలకు తెరదీశాడన్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి పదవిని కాపాడుకోవడం కోసం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిరంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కాకా పడుతున్నాడన్నారు. తన తమ్ముడు రాజగోపాల్‌రెడ్డికి ఎక్కడ మంత్రి పదవి వచ్చి తన పదవి పోతుందోనన్న భయం ఆయన్ను వెంటాడుతుందన్నారు. బూతులు తిట్టడానికి తమకు చేతకాక కాదని అయితే సంస్కారం అడ్డు వస్తుందని, కోమటిరెడ్డి కంటే ఎక్కువగా తాను తిట్టగలను అని అన్నారు. సమావేశంలో పట్టణ శాఖ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు రావుల శ్రీనివాస్ రెడ్డి, కరీంపాషా, అయితగోని యాదయ్య, కొండూరు శంకర్, ప్రదీప్ రెడ్డి, బొమ్మరబోయిన నాగార్జున, రాజిరెడ్డి, అవినాష్,మెరుగు గోపి పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశ దరఖాస్తు గడువు పెంపు

పెద్దవూర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని చలకుర్తి క్యాంప్ జవహర్ నవోదయ పాఠశాలలో 9, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆన్‌లైన్ గడువును నవంబరు 19 వరకు పొడిగిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం శనివారం తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 8, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 19వ తేదీ గడువు అని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 8 ఉంటుందని ఆయన తెలిపారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు నవోదయ విద్యాలయ వెబ్‌సైట్‌లో ఫారం నింపి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష హిందీ, ఇంగ్లీషు మాధ్యమాల్లో ఉంటుందని ఆయన ప్రిన్సిపాల్ తెలిపారు.

డిసెంబరు 9లోపు రుణమాఫీ పూర్తి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రామన్నపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 9వ తేదీలోపు పూర్తి రుణమాఫీ చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీఇచ్చారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో రూ.3.5కోట్లతో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. రామన్నపేటలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. రైతుల సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. 22 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని మిగిలిన వారికి డిసెంబరు 9 లోపు పూర్తి రుణమాఫీ చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు విషయమై రైస్‌మిల్లర్లతో శుక్రవారం సీఎం సమక్షంలో సమావేశం జరిగిందని, మిల్లర్లకు ప్రస్తుతం సర్‌చార్జీలు పెంచామన్నారు. రూ.3వేల కోట్లతో ప్రభుత్వమే పంటల బీమా ఏర్పాటు చేయబోతుందన్నారు. నేతన్నల రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, త్రిఫ్ట్ ఫండ్ కింద రూ.100 కోట్లు మంజూరు చేశామన్నారు. రద్దయిన ఆప్కోను పునరుద్ధరించి చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చేనేత ద్వారా రాష్ట్రంలోని ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ఆప్కాబ్‌ను పునరుద్ధరించి నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. వెనకబడిన రామన్నపేటను అన్నిరంగాల్లో అభివృద్ధి కోసం నూతన పథకాలను మంజూరు చేయడానికి, ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీఏవో గోపాల్, సీఈవో ఆర్ శంకర్‌రావు, ఎన్ శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, రాఘవరెడ్డి, సీఈవో జంగారెడ్డి, తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీవో యాకూబ్‌నాయక్, జినుకల ప్రభాకర్, గంగుల రాజిరెడ్డి, పూస బాలకిషన్, తిమ్మాపురం మహేందర్ రెడ్డి, గుత్తా నర్సిరెడ్డి, గోదాసు శిరిషపృథ్వీ, మడూరు జ్యోతి, రాపోలు నర్సింహ, జెల్ల వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆవిష్కర్తలుగా ఎదగాలి



ఎంజీయూలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వీసీ అల్తాఫ్‌హుస్సేన్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఎంజీయూలో పలు నిర్మాణాలకు శంకుస్థాపన

నల్లగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆవిష్కర్తలుగా ఎదగాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని ఎంజీయూలో పరిపాలనా భవనం, బాలికల హాస్టల్ అదనపు భవనం, క్యాంపస్‌లోని రెండో దశ సీసీ రోడ్లతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అబ్దుల్ కలాం సూక్తిని పుణికిపుచ్చుకొని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. సామాజిక సవాళ్లను పరిష్కరించే స్టార్టప్‌లు స్థాపించి ఇన్నోవేటర్‌లుగా ఎదగాలని కాంక్షించారు. ఎంజీయూలో మౌలిక సదుపాయాలు, విద్యా వాతావరణాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో రూ.37కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు మొదటి దశ పనులు ప్రారంభించామన్నారు. లైబ్రరీకి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.10లక్షల విలువ గల పుస్తకాలు అందజేశామన్నారు. క్యాంపస్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ వంటి సంస్థ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠీ మాట్లాడుతూ, యూనివర్సిటీ అభివృద్ధికి తన పూర్తి సహకారం అందిస్తానన్నారు. వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ, యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించేందుకు మంత్రి చొరవ తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ గ్రాంట్స్, శాశ్వత అధ్యాపకుల నియామకం, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు బడ్జెట్ కేటాయింపునకు మంత్రి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, వోఎస్‌డీ అంజిరెడ్డి, ఆడిట్‌సెల్ డైరెక్టర్ వై.ప్రశాంతి, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డాక్టర్ రమణారెడ్డి, ప్రేమ్‌సాగర్, అరుణ ప్రియ, దోమల రమేష్, ఉపేందర్‌రెడ్డి, మద్దిలేటి, గోనా రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలుర కబడ్డీ విజేతగా నల్లగొండ





అండర్-14 విభాగంలో ప్రథమస్థానం పొందిన నల్లగొండ జట్టుకు బహుమతి అందజేస్తున్న తీన్మార్‌మల్లన్న, సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్లన్న

- బాలికల విభాగంలో ఖమ్మం
- ముగిసిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు

తుర్కపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో బాల, బాలికల విభాగాల్లల నల్లగొండ, ఖమ్మం జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా సాగుతున్న రాష్ట్ర స్థాయి 68వ ఎస్‌జీఎఫ్ పోటీలు శనివారంతో ముగిశాయి. అండర్-17 బాలుర విభాగం ఫైనల్స్‌లో వరంగల్ జట్టు 45-35తో రంగారెడ్డి జిల్లా జట్టును ఓడించి ప్రథమ స్థానంలో నిలించింది. రంగారెడ్డి జిల్లా జట్టు ద్వితీయస్థానంతో సరిపెట్టుకుంది. బాలుర విభాగంలో నల్లగొండ జట్టు మూడోస్థానంలో నిలిచింది. అండల్-14 బాలిల విభాగంలో నల్లగొండ, ఖమ్మం బాలికల జట్లు పోటీ పడగా నల్లగొండ బాలికల జట్టు గెలుపొంది ప్రథమ స్థానం సాధించగా, ఖమ్మం జట్టు ద్వితీయ స్థానం, రంగారెడ్డి జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచింది. అండర్-14 బాలుర విభాగంలో ఫైనల్స్‌లో నల్లగొండ జిల్లా జట్టు ఖమ్మం జట్టును ఓడించి విజేతగా నిలిచింది. ఖమ్మం రెండో స్థానంలో నిలువగా రంగారెడ్డి జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచింది. కాగ మాదాపూర్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సహకారంతో ఆయన స్వగ్రామంలో ఈ పోటీల్లో ఉమ్మడి 10 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. మొదటి రెండు రోజులు లీగ్ దశ పోటీలను నిర్వహించి, చివరి రోజైన శనివారం సెమీఫైనల్స్, ఫైనల్స్ నిర్వహించారు. పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఈ క్రీడలను ఫ్లడ్‌లైట్ల వెలుగులో సాయంత్రం 7 గంటల వరకు నిర్వహించారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బెస్ట్ ప్లేయర్ అవార్డు కింద రూ.10వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని తీన్మార్ మల్లన్న అందజేశారు.

భువనగిరిలో జాతీయస్థాయి పోటీలకు కృషి చేస్తా: తీన్మార్ మల్లన్న

అందరి సహకారంతో త్వరలో భువనగిరి పట్టణకేంద్రంలో మాదాపూర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మాదాపూర్‌లో నిర్వహించిన రాష్ట్ర కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన శనివారం రాత్రి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పోర్ట్స్ యూనివర్సిటీని తీసుకువస్తున్నారని, 2036 ఒలంపిక్ క్రీడలను కూడా రాష్ట్రంలోనే నిర్వహించాలని చూస్తున్నారని తెలిపారు. మూడో తరగతి నుంచే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు ఉపాధ్యాయులు, పీఈటీలు కృషి చేయాలన్నారు. ఒలంపిక్ క్రీడల్లో పాల్గొనేలా ఆణిముత్యాలు, మెరికల్లాంటి క్రీడాకారులను అందించాలన్నారు. క్రీడల్లో ఓడిపోయిన విద్యార్థులు ఎవరూ నిరుత్సాహపడొద్దని, తాను కూడా రెండుసార్లు ఓడిన తర్వాతే విజయం సాధించానని, విద్యార్థులకు గుర్తుచేశారు. మాదాపూర్ ఉన్నత పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో ఉంచుతానన్నారు. రాష్ట్ర క్రీడల విజయవంతానికి కృషి చేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో సత్యనారాయణ, తహసీల్దార్ దేశ్యానాయక్, ఎస్‌జీఎఫ్ స్టేట్ కార్యదర్శి కుంభం రాంరెడ్డి, ఎంఈవో మాలతి, పాఠశాల క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్)కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ, క్రీడల ఆర్గనైజర్ చింతపండు వెంకటేశ్వర్లు, కన్వీనర్ లింగంపల్లి విజయ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ భాగ్యమ్మ, మాజీ సర్పంచ్‌లు కొమిరిశెట్టి నర్సింహులు, సుంకరి శెట్టయ్య, మాజీవైస్‌ఎంపీపీ శ్రీనివాస్,నాయకులు యాట పెంటయ్య, పలుగుల శ్రీనివాస్ సీత రాజు, మీడియా కోఆర్డినేటర్ బొమ్మ రవీందర్, పీడీ వెంకట్‌రెడ్డి, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసి దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి, నిత్యతిరుకల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి మహామడపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్యరుద్రహవన పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధవిభాగాల ద్వారా రూ.42,42,475 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామి వారి దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో శనివారం యాదగిరికొండపై రద్దీ నెలకొంది. ఇష్టదైవాలను దర్శించుకునేందుకు సుమారు 22వేల మంది భక్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కొండకింద 820 జంటలు సత్యదేవుని వ్రతాలు జరిపించగా మధ్యాహ్నం వరకు ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో రద్దీ నెలకొని ప్రత్యేక దర్శనాలకు ఒక అరగంట ధర్మదర్శనాలకు గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. కార్తీకమాసం సందర్భంగా ప్రధానాలయం, శివాలయం, ప్రసాద విక్రయశాల, తిరువీధుల్లో రద్దీ నెలకొంది. హైకోర్టు న్యాయమూర్తి పుల్ల కార్తీక్ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలను ఈవో అందజేశారు.

జోనల్‌స్థాయి క్రీడలకు సిద్ధమైన రాజాపేట


క్రీడా పోటీల కోసం సిద్ధం చేసిన పాఠశాల ప్రాంగణం

రాజాపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):జోనల్‌స్థాయి క్రీడా పోటీలకు యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సిద్ధమైంది. ఈనెల 11నుంచి 14వరకు పోటీలను నిర్వహిం చనున్నారు. క్రీడాకారులకు వసతి సౌకర్యాలతో పాటు క్రీడాప్రాంగణాన్ని సిద్ధం చేశారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగంలో తొమ్మిది రకాల పోటీలు జరుగనున్నాయి. జనగామ, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, భువనగిరి జిల్లాలోని 13 పాఠశాల నుంచి 1,105 మంది విద్యార్థులు పోటీలో పాల్గొననున్నట్లు జోనల్ ఆఫీసర్ విద్యారాణి తెలిపారు. ఖోఖో, క్యారమ్, చెస్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్, టెన్నికాయిట్, హ్యాండ్‌బాల్ పోటీలను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభిస్తారని ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. .

మునగాలలో 10వ జోనల్ స్థాయి పోటీలు..

మునగాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో ఈ నెల 11 నుంచి14 వరకు నిర్వహించే 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలకు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఆవరణను సిద్ధం చేశారు. శనివారం క్రీడాప్రాంగణాన్ని జోనల్ అధికారి విద్యారాణి పరిశీలించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రిభువనగిరి, జనగాం జిల్లాలోని 9 పాఠశాలకు చెందిన 765 మంది విద్యార్థులు పోటీలో పాల్గొంటారని తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నామని, పోటీలకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక



గుర్రంపోడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు నల్లగొండ జిల్లా గుర్రంపోడు పిట్టలగూడెం గ్రామంలోని మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థి ఫయాజ్‌మాలిక్ ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో శనివారం నల్లగొండలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో చోటుసాధించారు. ఫయాజ్‌మాలిక్‌ను కళాశాల ప్రిన్సిపల్ మహ్మద్ ఫారూఖ్, పీడీ శ్రీను, అధ్యాపకులు రామకృష్ణ, గోవర్ధన్, వేణుగోపాల్, వెంకన్న, అతియాఅంజుం, శ్రీలత, సమీనాసుల్తానా, స్టాఫ్‌నర్స్ శ్రీనయ్య అభినందించారు.

నౌకాదళ థింక్యూ క్విజ్‌లో రాణించిన కోదాడ విద్యార్థులు


క్విజ్ ఫైనల్ పోటీల్లో పాల్గొన్న తేజ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోదాడ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నౌకాదళ థింక్యూ క్విజ్-2024 లో సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు రాణించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. భారత నౌకాదళం ప్రతిష్ఠాత్మకంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు థింక్యూ క్విజ్-2024 ఫైనల్స్ పోటీలను ఈ నెల 7, 8 తేదీల్లో కేరళ రాష్ట్రంలోని ఎర్నాకుళంలో భారత నావికా శిక్షణా కేంద్రంలో నిర్వహించిందన్నారు. ఈ పోటీలకు తెలంగాణ నుంచి కోదాడ తేజ విద్యాలయం, హైదరాబాద్ నుంచి జాన్సన్ గ్రామర్ పాఠశాల విద్యార్థులు ఫైనల్స్‌కు ఎంపికయ్యారన్నారు. తమ విద్యాలయానికి చెందిన 9వ తరగతి విద్యార్థి సృజన్‌గుప్తా, 10వ తరగతి విద్యార్థి కొండ్రు నవీన్‌కుమార్, క్విజ్ శిక్షణకు ఉస్తెల ధనుష్‌రెడ్డి, సృజన్ తండ్రి, డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ నేముల వెంకటేశ్వర్లు హాజరయ్యారన్నారు. ఫైనల్స్‌లో జైపూర్‌కు చెందిన జయశ్రీ పెరివాల్ పాఠశాల విజేతగా నిలవగా, ద్వితీయ స్థానం చెన్నైకు చెందిన భవాన్స్ రాజాజీ విద్యాశ్రమ్ సాధించిందని, తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి 7వ స్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా భారత నౌకాదళం అధిపతి దినేష్ త్రిపాఠి, వారి సతీమణి శశి త్రిపాఠి నుంచి విద్యార్థులు సృజన్, నవీన్, అధ్యాపకుడు ధనుష్ ప్రశంసాపత్రం, జ్ఞాపిక, ఆపిల్ ల్యాప్‌టాప్ బహుమతిగా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, డైరెక్టర్ సోమిరెడ్డిలు అభినందించారు.

యాదవుల సంక్షేమానికి ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్

భువనగిరి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యాదవుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నదని రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్, బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి భువనగిరిలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో వారు మాట్లాడారు. మాట్లాడుతూ రాజ్యాధికారం లక్ష్యంగా బీసీలు ఐక్యం కావాలన్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీ బడుగు లింగయ్య యాదవ్ మా ట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలోనే యాదవులకు ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యత లభించిందన్నారు. పలువురు గొల్ల కురుమ సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్‌లో యాదవులకు అవకాశం కల్పించాలన్నారు. ఊరేగింపు, దున్నపోతుల విన్యాసాలు, ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ మా య దశరథ, శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేష్‌యాదవ్, క్యామ మల్లేశం, దూదిమెట్ల బాల్‌రాజ్‌యాదవ్, తోటకూరి వెంకటేశం పాల్గొన్నారు.

స్వర్ణతాపడం చకచకా

(5పేజీ తరువాయి)

విమానగోపురం బంగారుతాపడం పనులు పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

స్వర్ణతాపడం అనంతరం మహాకుంభాభిషేకం

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఉద్ఘాటనకు ముందుగా 1,008 కుండలాలతో యాగం చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అయితే చినజీయర్‌స్వామికి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్య విభేదాలు రావడంతో యాగం వాయిదా పడింది. అప్పటికే పలు యాగశాలల నిర్మాణాలు చేపట్టినప్పటికీ, ప్రభుత్వం సాధారణంగానే బాలాలయంలో యాగాలు చేసి ఆలయ సంప్రోక్షణ పూజలు చేపట్టింది. అనంతరం 2022 మార్చి 28న ఆలయ ఉద్ఘాటన నిర్వహించింది. అయితే ఆలయ ఉద్ఘాటన సమయంలో ఎవ్వరినీ ఆహ్వానించకుండా, మంత్రులు, ప్రజాప్రతినిధులతో ఆలయ ఉద్ఘాటన పూర్తిచేశారు. దీనిపై ప్రతిపక్షాలతోపాటు పలు ధార్మిక సంస్థలు విమర్శలు వ్యక్తం చేశాయి. కాగా, విమాన గోపురానికి బంగారు తాపడం పనులు పూర్తిచేశాక మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. 2025 మార్చి 1వ తేదీ నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ఈలోగా విమానగోపురానికి స్వర్ణతాపడం పనులు పూర్తి చేసి, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో స్వామివారి చెంతన మహాకుంభాభిషేకం అనంతరం బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 15నుంచి బంగారు తాపడం అమర్చే పనులకు మొత్తం 60కిలోల బంగారం వినియోగిస్తుండగా, గోల్డ్ ప్లేటింగ్ తయారీ, ఫిక్సింగ్ చార్జీలకు మొత్తం రూ.8కోట్లు వెచ్చిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆలయ అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులపై సర్కారు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. వైటీడీఏ చేపట్టిన పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులపై నివేదికను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

స్వర్ణతాపడం పనులు వేగవంతం చేస్తున్నాం

స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ముందుగానే విమాన గోపురానికి స్వర్ణతాపడం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాగి రేకులపై బంగారు తాపడం పనులు కొనసాగుతున్నాయి. ఈ నెల 15నుంచి పనులు వేగవంతం చేయనున్నాం. మార్చి 1నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ఉన్నాయి. ఈలోగా విమానగోపురానికి స్వర్ణతాపడం పనులు పూర్తవుతాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గుట్టలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

భాస్కర్‌రావు, ఆలయ ఈవో

నేటి నుంచి మత్స్యగిరి బ్రహ్మోత్సవాలు

వలిగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాల ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లుచేశారు. మనోహరమైన, దివ్యమైన ఎత్తయిన కొండపై స్వయంభూగా వెలిసిన శ్రీహరి భక్తుల కొంగుబంగారంగా పూజలు అందుకుంటున్నారు. పుష్కరిణిలో స్వామివారు నామాలు, కోరమాసాలలో మత్స్యం(చేప) అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వడం ఇక్కడి విశిష్టత.


కొండపైన ముస్తాబైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం


చలువ పందిళ్లు

ముస్తాబైన ఆలయం

మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు అందంగా ముస్తాబైంది. గుట్టపైన చలువ పందిర్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుద్దీపాలతో దేవాలయ ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 10 నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను అత్యంతవైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 10న ఆదివారం విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, స్వస్తివాచనం, విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యహావాచనం, అంకురార్పణ, గరుడ ధ్వజాదివాసం, 11 సోమవారం గరుడ ధ్వజప్రతిష్ట, పల్లకి, ధ్వజారోహణం, బలిప్రదానం, భేరీతాండవం, దేవతాహ్వానం, హోమం, 12 మంగళవారం చతుస్థానార్చన, హోమం, బలిప్రదానం, ఉత్సవమూర్తులకు స్నపనం, స్వయంభూ స్వామివారికి నవకళశ స్నపనం, తీర్థప్రసాద గోష్ఠి, 13 బుధవారం ఎదుర్కోలు మహోత్సవం, ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 14 గురువారం శ్రీ సుదర్శన నారసింహ, చతుస్థానార్చన, హోమం, ఉత్సవ మూర్తులతో స్నపనం, 15 శుక్రవారం చక్రతీర్థం అలంకారం, దేవతోద్వాసనం, పుష్పయాగం, ద్వాదశారాధన, ధ్వజావరోహణం, ఏకాంతసేవ, ఉత్సవ పరిసమాప్తి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


ఎత్తయిన ఆంజనేయస్వామి విగ్రహం

ఎత్తయిన అభయాంజనేయ స్వామి విగ్రహం

మత్స్యగిరీశుడి సన్నిధికి చేరే మార్గంలో మేకల బండ వద్ద రెండు ఘాట్‌రోడ్లు గుట్టపైకి చేరే ప్రదేశంలో ఎత్తయిన అభయాంజనేయస్వామి విగ్రహాన్ని నార్మాక్ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి 42ఫీట్ల ఎత్తుతో సొంత నిధులతో ఏర్పాటుచేయించారు. ఈ విగ్రహం మత్స్యగిరికి ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో మోహన్‌బాబు తెలిపారు. చలువ పందిర్లు, మంచినీరు. షామియానాలు ఏర్పాట్లుచేశామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బ్రహ్మోత్సవాలు తిలకించి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	226	254
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.40
టీఎంసీలు	305.7464
ఎడమకాల్వకు నీటి విడుదల	4,416
కుడికాల్వకు	10,120
విద్యుత్ కేంద్రం ద్వారా	12,748
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	64,356 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	30,084 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.89 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	8,828 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	12,000క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం


పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.82 అడుగులు
టీఎంసీలు	4.13
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	577.42 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	324.65 క్యూసెక్కులు

భువనగిరి ఖిల్లాపై పర్యాటకులు సందడి


భువనగిరి ఖిల్లాపై అమెరికా వాసులు

భువనగిరి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భువనగిరి ఖిల్లాకు శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పెద్ద సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. అమెరికాకు చెందిన సుమారు 13 మంది పర్యాటకులు 3 బృందాలుగా వేర్వేరుగా ఖిల్లాను అధిరోహించారు. ఈ సందర్భంగా ఖిల్లాపై కలుసుకున్న ఆ బృందాలు హలో యూఎస్‌ఏ అంటూ పలకరించుకొని అమెరికాలో నివసించే ప్రాంతాలపై చర్చిం చుకున్నారు. ఖిల్లాపై ఉన్న చారిత్రక కోట గోడ తదితర తీరును ప్రశంసించారు. హైదరాబాద్‌కు చెందిన 20 మందితో కూడిన వైద్యుల బృందం కూడా ఖిల్లాను అధిరోహించింది. కార్పొరేట్ ఉద్యోగులు సాహస క్రీడలైన రాక్ క్లైంబింగ్, రాప్లింగ్, జిప్ లైన్‌లో ఉత్సాహంగా పా ల్గొన్నారు. అలాగే వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఖిల్లాపై పర్యాటకుల సందడి నెలకొన్నది. గైడ్ ఆవుల వినోద్‌కుమార్ ఖిల్లా విశేషాలను వివరించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


బాలయ్య(ఫైల్)

తుర్కపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో శనివారం కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేస ుకున్నాడు. ఈ ఎస్‌ఐ తకియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గొల్లని బాలయ్య (38)కి కీసర మండలం గోధుమకుంట గ్రామానికి చెందిన మమతతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి పిల్లలు లేకపోవడంతో బాలయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 7న తల్లి లక్ష్మీ, భార్య మమతతో గొడవ పడి వారిద్దరిని కొట్టాడు. దీంతో ఇద్దరు యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి తల్లి లక్ష్మీ ఇంట్లో జరిగిన గొడవ గురించి మాదాపురంలో ఉంటున్న అల్లుడికి చెప్పి అతడి గురించి తెలుసుకోమని చెప్పింది. ఈ నేపథ్యంలో ఇంటికి వెళ్లి చూసే సరికి బాలయ్య ఇంట్లో ఉన్న పైపునకు లుంగీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మమత ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి కేంద్ర ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆభరణాల కోసం వృద్ధురాలి హత్య

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో ఘటన


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వేములపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆభరణాల కోసం వృద్ధురాలిని హత్య చేసిన సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని మంగాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆలకుంట్ల లక్ష్మమ్మ(75) తన పెద్ద కుమారుడైన దుర్గయ్య, కోడలు చంద్రకళతో కలిసి నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం దుర్గయ్య అతని భార్య చంద్రకళ వ్యవసాయ పనులకు పొలానికి వెళ్లగా లక్ష్మమ్మ ఒంటరిగా ఇంట్లో ఉంది. దుర్గయ్య సాయంత్రం పొలం పనులు ముగించుకొని ఇంటికి వచ్చే వరకు లక్ష్మమ్మ ఇంటి వరండాలో మృతిచెంది ఉన్నట్టు గుర్తించాడు. సాధారణ మరణంగా భావించి బంధుమిత్రులకు సమాచారం ఇచ్చి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాత్రి సమయంలో లక్ష్మమ్మ చెవుల వైపు చూడగా రక్తపు మరకలు ఉన్నాయి. మెడలోని నల్లపూసల గొలుసు, చెవి దిద్దులు, కమ్మలు లేకపోవడంతో హత్య చేసి ఆభరణాలను అపహరించినట్లు నిర్ధారించుకొని గ్రామస్థుల సహాయంతో రాత్రి వేములపల్లి ఎస్‌ఐ వెంకటేశానికి సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ వెంకటేశం ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా ఎస్పీ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో కలిసి రాత్రి సంఘటన స్థలానికి చేరుకొని లక్ష్మమ్మ మృతదేహాన్ని పరిశీలించారు. చెవి చివర కట్ అయి ఉండగా శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో ఇంటి సమీపంలో వెతకగా ఇంటి గేటు సమీపంలో ఒక చెవిదిద్దు పడి ఉండడాన్ని గుర్తించారు. దీంతో ఎవరో దుండగులు లక్ష్మమ్మను హత్యచేసి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు అనుమానం వ్యక్తంచేశారు. దుర్గయ్య ఫిర్యాదు మేరకు సీఐ వీరబాబు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం నిపుణుల ఆధ్వర్యంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని ఉన్నతాధికారుల సూచనలతో నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసేందుకు మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో ఒక బృందాన్ని ఏర్పాటు చేయగా సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో మరో బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని 14 గొర్రెలు మృతి

దేవరకొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని 14 గొర్రెలు మృతి చెందాయి. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలో శనివారం జరిగింది. దేవరకొండ సీఐ నరసింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పడమటిపల్లికి చెందిన వెంకటమ్మ గొర్రెలను మేతకు తీసుకెళ్లింది. సాయంత్రం తిరిగి ఇంటికి తోలుకెళ్తుండగా కల్వకుర్తి నుంచి దేవరకొండకు వస్తున్న లారీ అతివేగంగా గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 14 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని ఆమె వాపోయింది. తనకు న్యాయం చేయాలని వెంకటమ్మ వేడుకుంది. వెంకటమ్మ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీఐ నరసింహులు తెలిపారు.

ఒకరి రిమాండ్

మునుగోడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మునుగోడుకు చెందిన ఆకారపు గణేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు చండూరు సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు. గత జూలై 20వ తేదీన పట్టణంలో అక్రమంగా గంజాయి విక్రయిన్న కేసులో ఆరుగురు నిందితులు ఉన్నారు. వారిలో ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఇన్నాళ్లు పరారీలో ఉన్న గణేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటయ్య, పేర్కొన్నారు.

కొనసాగుతున్న భూసర్వే


సర్వేను పరిశీలిస్తున్న సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రమణయ్య

తిరుమలగిరి(సాగర్), న వంబరు 9 (ఆం ధ్రజ్యోతి): రెవె న్యూ పైలెట్ ప్రాజెక్టులో భా గంగా మండలంలో భూసర్వే శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా చింతలపాలెం గ్రామంలో సర్వే నెం. 204, అల్వాలలో 477, తిరుమలగిరిలో 771 సర్వే నెంబర్లలో ఖాస్తు కబ్జాలో ఉన్న రైతులను గుర్తించేందుకు సంబంధిత అధికారులు స ర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాండ్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పె క్టర్ రమణయ్య మాట్లాడుతూ సర్వేను వేగవంతం చేసేందుకు సెలవు దినాల్లో కూడా వివిధ టీం లకు సంబంధించిన అధికారులు, సర్వేయర్లు పని చేస్తున్నట్లు తెలి పారు. త్వరలోనే సర్వేను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐ చంద్రశేఖర్, సర్వేయర్లు మధు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉదయం సైకిల్‌పై రెక్కి.. రాత్రి ఇళ్లలో చోరీ

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేటరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉదయం సైకిల్‌పై తిరుగుతూ రెక్కి నిర్వహించి.. రాత్రి పూట ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. సూర్యాపేటరూరల్ పోలీసులు శనివారం సూర్యాపేట జనగాం క్రాస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను శనివారం సూర్యాపేట డీఎస్పీ రవి సూర్యాపేటరూరల్ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గోదావరి జిల్లాకు చెందిన కొండేపురి రామకృష్ణ ఈ సంవత్సరం జూన్ నెలలో కుడకుడ పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లో బంగారు కడియం, 9 బంగారు ఉంగరాలు, ఒక బంగారు చైన్ దొంగిలించాడు. జూలై మొదటి వారంలో పట్టణంలోని జీఎంఆర్ టౌన్‌షిప్‌లో బంగారు హారం , నల్లపూసల గొలుసు, రెండు బంగారు చైన్‌లు, చెంపసరాళ్లు, మాటిళ్లు, చిన్న పిల్లల చేతి కడియాలు, ఉంగరాలు, రూ.6వేల నగదు, అక్టోబరు 31న జనగాం క్రాస్ రోడ్డు వజ్రా టౌన్‌షిప్‌లో రూ.4500నగదు దొంగిలించాడు. అతనిపై దిల్‌సుఖ్‌నగర్, మేడిపల్లి, సరూర్‌నగర్, బోత్‌పూర్ పోలీస్‌స్టేషన్లలో 40కి పైగా కేసులు నమోదయ్యాయి. నిందితుడు గతంలో చర్లపల్లి సెంట్రల్ జైలులో రెండున్నరేళ్లు ఉన్నాడు. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న రామకృష్ణను రిమాండ్ చేసి జైలుకు తరలించారు. అతని వద్ద నుంచి మొత్తం 117.318గ్రాముల బంగారం, రూ.లక్ష 20వేల నగదును రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ బాలునాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై దాడి హేయనీయం : ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి హేయనీయమని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితబంధు లబ్ధిదారులకు న్యాయం చేయాలని అడిగిన కౌశిక్‌రెడ్డిపై పోలీసులు విచక్షణారహితంగా దాడికి పాల్పడటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతోనే దాడి జరిగిందని ఆరోపించారు. అకారణంగా దాడికి పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకో వాలని ఆయన అన్నారు. అదేవిధంగా పోలీసులు అరెస్ట్ చేసిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గులాబీ కార్యకర్తలు తాటాకు చప్పుళ్లకు భయపడరని కోటిరెడ్డి పేర్కొన్నారు.

సమాచారం

ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా చింతాబాబు

కోదాడటౌన్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కోదాడ పట్టణానికి చెందిన చింతాబాబు మాదిగ నియమితులయ్యారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య హైదరాబాద్‌లో శనివారం నియమక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చింతబాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు ఉద్యమిస్తానన్నారు. తన నియమకానికి సహకరించిన సంఘం నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

కోదాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినిలు క్షేత్రపర్యటనలో భాగంగా శనివారం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా మోతుగూడెంలోని సీలేరు హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్లాంట్స్‌ను సందర్శించారు. విద్యార్థులు 1050మెగా వాట్స్ విద్యుత్ యూనిట్లను పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి జరిగే విధానాన్ని ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట అధ్యాపకులు శివాజీ, నర్మద, రామకృష్ణలు ఉన్నారు.

'మాదిగలకు అన్యాయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి'

కోదాడటౌన్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను అన్యాయం చేస్తున్నారని ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సి. సోమశేఖర్ అన్నారు. పట్టణంలోని ఎంఎస్ కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణ జరగకపోవడంతో మాదిగలు విద్యా ఉద్యోగాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. వెంటనే వర్గీకరణకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నవీన్, తరు ణ్, ఏపూరి రాజు, అంజయ్య, రాము, సత్యరాజు, వంశీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కోటి దీపోత్సవం

హుజూర్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా పట్టణంలో కనకదుర్గ దేవాలయంలో కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు నరగిరినాధుని రంగభట్టాచార్యులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. దుర్గామాతకు పడిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంతానసోమలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కనకదుర్గ దేవాలయంలో గల సంతాన సోమలింగేశ్వరస్వామికి శనివారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో బాచిమంచి కొండయ్య, పల్లుణశర్మ, ఉపేందర్, రాము, సూర్యనారాయణ, రాంప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భానుపురి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలకు అడ్డుఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సూర్యాపేట టౌన్-1 ఏఈ ఆర్. సురేష్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. జమ్మిగడ్డ, హౌసింగ్‌బోర్డుకాలనీ, శ్రీనివాసా కాలనీ, గోపాలపురం, కొత్తగూడెంబజార్, పీఎస్ఆర్ సెంటర్, రాజీవ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, చింతలచెర్వు, భగత్‌సింగ్‌నగర్, అమ్మ గార్డెన్, తిరుమలనగర్, కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, ఇండస్ట్రీయల్ ప్రాంతం, వాణిజ్యభవన్, రామలింగేశ్వర్ థియేటర్, లక్కీ ట్రావెల్స్, విద్యానగర్, ఎంఎస్ఆర్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నరేందర్‌కు డాక్టరేట్



చిలుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన పెండెం నరేందర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. యూనివర్సిటీలో డాక్టర్ పవన్‌కుమార్ పర్యవేక్షణలో లైబ్రరీ ఇన్‌ఫర్మేషన్ విభాగంలో 'నీడ్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం ఆఫ్ ఎల్ఐఎస్ ప్రొఫెషనల్స్ ఆఫ్ అకాడమిక్ లైబ్రరీస్' అనే అంశంపై పరిశోధన చేశారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

తుంగతుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కోరారు. శనివారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందించాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేస్తామని రాహుల్ గాంధీ కామారెడ్డిలో జరిగిన సభలో ప్రకటించారని గుర్తుచేశారు. వరంగల్ జిల్లా డిక్లరేషన్ సభలో రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దయానంద్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఉపాధ్యక్షుడు చింతకుంట్ల వెంకన్న, రమేష్, ప్రవీణ్‌రెడ్డి, దాయం ఝాన్సీ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అన్నారంలో సర్వే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలి

నూతన్‌కల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సర్వేలో కుటుంబ వివరాలలో తప్పులు దొర్లకుండా చూడాలని అదనపు కలెక్టర్ రాంబాబు ఆదేశించారు. మండల కేంద్రంలో సర్వేను పరిశీలించారు. సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు వివరాలు ఇవ్వాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్నికల క్యాంపును సందర్శించారు. జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో సునీత, ఆర్ఐ హసన్ ఉన్నారు.

మోతె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి కుటుంబ సర్వేను ఎన్యూమరేటర్లు పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సర్వేను చేపట్లాన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సీతారామ్, తహసీల్దార్ అంజనేయులు, ఎంపీడీవో సంఘమిత్ర పాల్గొన్నారు.

సూర్యాపేటఅర్బన్: 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. జిల్లాకేంద్రంలోని 44వవార్డులో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఓటర్లు చిరునామ మార్పు, జాబితాలో ఇంటి పేరు, ఇతర సవరణలు జనవరి 1వతేదీ 2025 వరకు 18 సంవత్సరాలు నిండిన యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాదవ్, తసీహశ్ధార్ శ్యాంసుందర్‌రెడ్డి, కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్, ఆర్ఐ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ కపిల్, బీఎల్‌వోలు పద్మ, శ్యామల, వార్డు సభ్యులు ఇస్తర్, శ్రీధర్, మల్సూర్, పాల్గొన్నారు.

మద్దిరాల: సమగ్ర ఇంటింటి సర్వేను మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీవో ఇబ్రహిం, ఎస్‌వో మల్సూర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా వివరాలు నింపాలి

నేరేడుచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేటర్ల వివరాల సేకరణలో జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ సురగి సైదులు అన్నారు. మండలంలోని జగన్నాతండాలో చేపట్టిన ఇంటింటా సర్వేను పరిశీలించారు. ప్రజలు జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సమగ్ర కుటుంబ సర్వే ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం అందించిన ఫారాల్లో మాత్రమే వివరాలు నమోదు చేయాలని ఎలాంటి డూప్లికేట్ ఫారాలకు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అబ్బాస్ ఉన్నారు.

హుజూర్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే ఎంతో చారిత్రాత్మకమైందని టీపీసీసీ కార్యదర్శి ఎండీ. అజీజ్‌పాషా అన్నారు. పట్టణంలో కుటుంబ సమగ్ర సర్వేలో పాల్గొని మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోయిన్, కొమరయ్య, నర్సయ్య, పద్మ, లక్ష్మీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మునగాల: ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని మండల ప్రత్యేకాధికారి శిరీష అన్నారు. మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు ఫాంలో ఇచ్చిన కాలమ్స్‌లో నిబంధనల ప్రకారం తప్పులు లేకుండా నింపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్‌దీన్‌దయల్, పాల్గొన్నారు.

అర్వపల్లి: సర్వేకు సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే చేపట్టారు.

ఆత్మకూర్(ఎస్): ఇంటింటి సమగ్ర సర్వే మండలవ్యాప్తంగా ప్రారంభమైంది. మండలకేంద్రంలో సర్వేను తహసీల్దార్ వినోద్‌కుమార్, ఎంపీడీవో హసీం పరిశీలించారు.

మఠంపల్లి: సమగ్ర కుటుంబ సర్వేను సిబ్బంది పకడ్బందీగా వివరాలు సేకరించాలని తహసీల్దార్ మంగారాథోడ్ అన్నారు. మండలంలో చేపట్టిన సర్వేను పరిశీలించారు. సర్వే ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఉమా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత పాల్గొన్నారు.

నాగారం: సమగ్ర కులగణను గ్రామాల్లో పక్బడందీగా నిర్వహించాలని తహసీల్దార్ వి. బ్రహ్మయ్య కోరారు. నాగారం బంగ్లా గ్రామంలో ఇంటింటా ఎన్యుమరేటర్లు చేస్తున్న కుల గణన సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. మారయ్య, ఎంపీఎస్‌వో రమేష్, ఎంఈవో ప్రభాకర్, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కోదాడలో నిరసన తెలుపుతున్న మునిసిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు

కోదాడ, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు చెల్లించాలని మునిసిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు కోరారు. మునిసిపల్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. ఆరు నెలలుగా జీతాలు అందడంలేదని వాపోయారు. తమతో పారిశుధ్య పనులు చేయించుకుంటూ జీతం అడిగితే లేదని చెప్పడం ఎంతవరకు సంజసమని అన్నారు. మునిసిపల్ అధికారులను నిలదీశారు.

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కల్లాల వద్ద పని చేస్తున్న హమాలీ కార్మికుల రేట్లు పెంచాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రోషపతి కోరారు. వేపలసింగారంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పంట పొలాల వద్ద ఎగుమతులు, దిగుమతులుచేసే హమాలీ కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండలు, బ్రహ్మం, రవి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ రవి

ఆత్మకూర్(ఎస్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని సూర్యాపేట డీఎస్పీ రవి అన్నారు. మండలంలోని గట్టికల్ గ్రామంలో శనివారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అక్టోబరు 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా గట్టికల్ గ్రామంలో మద్యపానం నిషేదించి ఆదర్శంగా నిలిచారన్నారు. మద్యపాన నిషేదాన్ని పరిసర గ్రామాలు కూడా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ. శ్రీకాంత్‌గౌడ్, నాయకులు బైరు వెంకన్నగౌడ్, జేఏసీ బాధ్యులు దండ వెంకట్‌రెడ్డి, భూపతి రాములు పాల్గొన్నారు.

'కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి'

నేరేడుచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేప పిల్లల పంపిణీలో ప్రభుత్వ నిబంధనలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్యసహకార సంఘం ప్రమోటర్ పేరబోయిన వీరయ్య డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్య శాఖ సొసైటీలను ప్రోత్సహించేందుకు నాణ్యమైన ఉచిత చేప పిల్లలను పంపిణీ చేయాలని కాంట్రాక్టర్‌కు అప్పగించిందన్నారు. నిబంధనల ప్రకారం అందించాల్సిన చేప పిల్లలను అందించకుండా అప్పుడే పుట్టిన చిన్న చిన్న పిల్లలను అందిస్తున్నారని, 10వేల చేప పిల్లలను అందించాల్సి ఉండగా వెయ్యి పిల్లలను అందిస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు.

నేడు కమ్మ వనభోజన మహోత్సవం

కోదాడటౌన్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారకుంట సమీపంలోని ఇండస్ట్రీయల్ ఏరియా సమీపంలోని, యర్నేని బాబు తోటలో కమ్మవనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాబు తెలిపారు. శనివారం వనభోజన ఏర్పాట్లు పరిశీలించారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని కమ్మ సోదరులు కుటుంబ సమేతంగా వనభోజన మహోత్సవంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నిర్వహకులు సాగర్, వీరభద్రం, అప్పారావు, శ్రీనివాసరావు, కృష్ణరావు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కోదాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె. సురేష్ అన్నారు. జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. న్యాయ సహాయం అవసరమైన వారికి సేవాభావంతో సహాయం అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ, న్యాయవాదులు ఎస్ఆర్‌కే మూర్తి, చింతకుంట్ల రామిరెడ్డి, మేకల వెంకట్రావు, పాలేటి నాగేశ్వరావు, ఈదుల కృష్ణయ్య ఉన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

పెన్‌పహాడ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లునాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని లింగాల గ్రామంలో శనివారం జరిగిన సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఇంతవరకు కొనుగోళ్లు చేయకపోవడం విచారకరమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రాశులుగా పోసిన ధాన్యం అకాల వర్షానికి తడిస్తే ప్రభుత్వమే బాధ్యత వహించి కొనుగోలు చేయాలన్నారు. రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాలో వేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం మండల కార్యదర్శిగా దూపాడు గ్రామానికి చెందిన గుంజ వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మీ, సీపీఎం జిల్లా నాయకులు దండా వెంకట్‌రెడ్డి, వేల్పుల వెంకన్న, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, వీరబోయిన రవి, చినపంగి నర్సయ్య, సాయికుమార్, రణపంగి కృష్ణ, గుంజ వెంకటేశ్వర్లు, నెమ్మాది లక్ష్మమ్మ, మడ్డిఅంజిబాబుగౌడ్, అడివయ్య, రమేష్, ఐతబోయిన సత్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

పాత సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

మునగాల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకంలో పాత సిబ్బందిని క్రమబద్ధీకరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, కొక్కిరేణి లిఫ్ట్ చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని కొక్కిరేణి గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ఎత్తిపోతల పథకాల్లో నూతనంగా లస్కర్లు, హెల్పర్ల నియామకానికి చర్యలు తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కానీ ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనంతో ఇప్పటి వరకు లిఫ్ట్ ఎత్తిపోతల పథకాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేయడం సరైందన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఏర్పడిన నాటి నుండి ఎత్తిపోతల పథకాన్ని నమ్ముకుని స్థానికంగా ఉన్న కొంతమంది రైతులు, లిఫ్ట్ కమిటీ సభ్యులు లిఫ్ట్ మోటార్లు నడపడం కోసం ఒక్కొక్క లిఫ్ట్ ఎత్తిపోతల పథకం వద్ద సిబ్బందిని నియమించుకుని ఎత్తిపోతల కార్యక్రమం నిర్వహించడం జరిగేదన్నారు. ఇప్పటివరకు లిఫ్ట్ ఎత్తిపోతల పథకం వద్ద విధులు నిర్వహించిన వారందరి వివరాలను సమగ్రంగా విచారించి వారిని తిరిగి ప్రభుత్వం లస్కర్లుగా, హెల్పర్లుగా, ఉద్యోగులుగా నియమించాలని కోరారు. ముల్కలపల్లి సైదులు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో సమావేశంలో నందిగామ సైదులు, రేఖ లింగయ్య, రావులపెంట బ్రహ్మం, ముల్కలపల్లి నాగరాజు, మామిడి గురుమూర్తి, రావులపెంట శేషగిరి, సైదులు, రావులపెంట వెంకన్న, శంబయ్య, ఇంటూరి హుస్సేన్, కామల్ల ప్రసాద్ ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకుడు కోటేశ్వరరావు

సూర్యాపేటటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నిరంకుశ పాలనపై ప్రతిఘటన పోరాటాలు అజేయమని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి. కోటేశ్వర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో చంద్రపుల్లారెడ్డి వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి చంద్రపుల్లారెడ్డి అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, నాయకులు గంట నాగయ్య, పోటు లక్ష్మయ్య, కునుకుంట్ల సైదులు, బొడ్డు శంకర్, పొలెబోయిన కిరణ్, అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, కాకి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

దోపిడీని అరికట్టేందుకే విప్లవ పోరాటాలు

సమాజంలో దోపిడీ, దౌర్జన్యాలను అరికట్టేందుకే విప్లవ పోరాటాలు కొనసాగుతున్నాయని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోకినేపల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడారు. ప్రభుత్వం ఎదురుకాల్పుల పేరుతో చేసిన హత్యలు, భూస్వాములు చేసిన దాడుల్లో ఎందరో అమరులు అనారోగ్యాలతో అసువులు బాశారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, కారింగుల వెంకన్న, నర్సయ్య, వాస పుల్లయ్య, లక్ష్మయ్య చంద్రకళ, హుసెన్, సయ్యద్, లింగయ్య, రేణుక, జయమ్మ, సంతోషిమాత, బిక్షం, విజయ్, పాల్గొన్నారు.

శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలి

హుజూర్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. శనివారం రైస్‌మిల్లర్లు నర్సింహారావు, అప్పారావు, ప్రభాకర్‌లకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రైస్‌మిల్లుల్లో పనిచేసే కూలీలకు వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో పర్వతాలు, లాలయ్య, తిరపయ్య, వెంకటమ్మ, మంగమ్మ, వెంకటమ్మ, నాగవల్లి, సైదమ్మ, మల్లేశ్వరి, పద్మ, మాధవి పాల్గొన్నారు.

దళితుల పక్షాన పోరాడితే దాడులా

గరిడేపల్లి, నవంబరు 9: మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం రెండో విడత నిధులు మంజూరు చేయాలని దళితులతో కలిసి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శాంతియుతంగా నిరసన తెలిపితే పోలీసులు అరెస్టు చేయడం ఏమిటని బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి రాంసైదులు ప్రశ్నించారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. దళితుల పక్షాన పోరుడుతున్న నాయకులపై ప్రభుత్వ వ్యవహారం సరిగాలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాపోలు నవీన్, పల్లెపంగు నాగరాజు, పెరుమాళ్ల సతీష్, ఇంతియాజ్, రాంమధు, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి

సూర్యాపేటటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. మూసీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు మాజీ సీఎం కేసీఆర్‌ను దూషించడం కాంగ్రెస్ నాయకుల నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. పోరాటాలు, ఉద్యమాలు చేసి తెలంగాణ సాధించి తెలంగాణను సుభిక్షంగా ఉంచిన కేసీఆర్‌పై దూర్భషలాడడాన్ని ప్రజలు సహించరన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ పుట్టకిశోర్, నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జీడిబిక్షం, సవరాల సత్యనారాయణ, తూడి నర్సింహారావు, దొంగరి యుగేందర్, బత్తుల రమేష్, ఆకుల లవకుశ, గండూరి కృపాకర్, బత్తుల జానీ, ఎస్‌కె. రఫీ, చింతలపాటి మధు, నాగరాజు, సందీప్, ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నేడు సీపీఎం పట్టణ మహాసభ.. హుజూర్‌నగర్ : పట్టణంలోని సుందరయ్యభవన్‌లో ఆదివారం సీపీఎం పట్టణ మహాసభ నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మహాసభకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. ఈ సమావేశంలో నాగారపు పాండు, శీలం శ్రీను, హుస్సేన్, మురళి, యోనా తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం.. మద్దిరాల: కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. మండలంలోని గోరెంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అంగిరేకుల రాంమూర్తి తల్లి శశిరేఖ అనారోగ్యంతో మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, రేతినేని శ్రీను, కోడి కుమార్ యాదవ్, సురేష్, కంట్లం, బత్తుల వెంకన్న, సాగర్, శ్రీనివాస్ ఉన్నారు.

అమరవీరులకు నివాళి.. ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని ఏపూరు గ్రామంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపాల వద్ద జెండాలు ఎగురవేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు కునుకుంట్ల సైదులు, కంచనపల్లి సైదులు, సుధగాని వెంకన్న, ఎర్రయ్య, రమేష్, రవి, శ్రీశైలం, లింగయ్య, ఇబ్రహీం, ఎస్‌కె. ముజీంబాయ్, మల్లారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

చేప పిల్లలను సద్వినియోగం చేసుకోవాలి.. గరిడేపల్లి: ప్రభుత్వం సరఫరా చేస్తున్న చేప పిల్లలను సద్వినియోగం చేసుకోవాలని మత్స్య సహకార సంఘం సభ్యుడు కీసరి నాగయ్య అన్నారు. మండలకేంద్రంలోని తాళ్లచెర్వు, రాగిచెర్వుల్లో చేప పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో కీసరి వెంకటి, కీసరి బక్కయ్య, శ్రీను, మామిడి భూషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు.. మోతె: టీటీడీపీ సభ్యత్వ నమోదుతో పార్టీ బలోపేతం చేయాలని నియోజకవర్గ నాయకులు ముత్తినేని సైదేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగయ్యగూడెం గ్రామంలో టీటీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కోడే వాసు, కొల్లు నర్సయ్య, సాతులూరి గువరయ్య, వెంకటనర్సయ్య, ఉప్పగండ్ల శ్రీనివాస్‌రావు, సైదులు, ఎల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ ..

నాగారం: సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు గౌడ సంఘం నాయకులు మండల కేంద్రంలో భూమి పూజ నిర్వహించారు. సంఘం నాయకుడు ఆనంతుల వెంకటయ్య మాట్లాడుతూ కల్లు గీత కుటుంబంలో పుట్టిన సర్వాయి పాపన్న గోల్కొండ కోటను జయించి బహుజన రాజ్యాన్ని స్థాపించిన ధీరుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందారపు వెంకటయ్య, బాలగాని మురళి, నారాయణ, అనంతుల మల్లయ్య, బందారపు పిచ్చయ్య, ఆనంతుల యాదగిరి, ఖమ్మంపాటి చంద్రయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేయాలి.. మఠంపల్లి: ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యపాండునాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణాలు మాఫీ చేయాలన్నారు. రైతు భరోసా పథకాన్ని అమలు చేయలన్నారు. వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్లు పెంచి ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆధ్వర్యంలో కార్యచరణ రూపొందించి ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, నాయకులు శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సయ్యద్ రన్‌మియా, తిరపతయ్య, వెంకటరెడ్డి హర్యానాయక్, రాము, శంభయ్య తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు .. అర్వపల్లి: అరుణాచలంలో గిరిప్రదక్షణ కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారి రాజు తెలిపారు. అర్వపల్లిలో గిరిప్రదక్షణ కరపత్రాలను ఆవిష్కరించారు. సూర్యాపేట ఆర్టీసీ డిపో నుంచి బస్సులు నడుస్తాయని, నాలుగు రోజులు ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈదుల వీరపాపయ్య, రాంమూర్తి, ఏకాంబరం, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

తిరుమలగిరి రూరల్ నవంబరు 9: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి అప్పారావు అన్నారు. మండలంలోని మామిడాల గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రారంభించిన కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర, సన్నాలకు బోనస్ పొందాలన్నారు. వాతావరణాన్ని బట్టి రైతులు ధాన్యంపై పట్టాలు కప్పుకునేలా శ్రద్ధ వహించి నిర్వహకులకు సహకరించాలన్నారు. నిర్వహకులు కూడా రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ఎప్పుడికప్పుడు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఆంజనేయులు, ఎంపీఎం మధుసూదర్, సీసీలు ఇద్దయ్య, విజయలక్ష్మీ, ఏఈవో చైతన్య, సంఘబంధం సభ్యులు, నాయకులు శేఖర్‌రెడ్డి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ స్కూల్‌లో ఉర్దూడే వేడుకలు

హుజూర్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాలలో శనివారం ఉర్దూడే వారోత్సవాల సందర్భంగా విద్యార్థులు ఉర్దూడే ఆకారంలో కూర్చుని వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెహనాబేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉర్దూడే అక్షరాకృతిలో కూర్చున్న విద్యార్థులు